క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన


పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం: మండలంలోని వేమగిరిలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 35 పశువులకు గర్భకోశవ్యాధికి చికిత్స చేశారు.14 పశువులకు చూడి పరీక్షలు,32 పశువులకుసాధారణ చికిత్స జరిపారు. 30 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందజేశారు, ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ నక్కపల్లి సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వీర్రాజు మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సంక్రమిస్తే సకాలంలో వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం పశువుల్లో పాలఉత్పత్తిని పెంచే మినరల్ మిక్సర్ ప్యాకెట్లు,లివర్ టానిక్‌లు పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో లింగరాజుపాలెం పశువైద్యాధికారి కె.భరత్‌కుమార్,పి.భాను, డి.వంశీ కృష్ణయాదవ్,ఎస్.సౌజన్య, వీఎల్‌వోలు, గోపాల్ మిత్రలు,గ్రామసర్పంచ్ ముప్పిన అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం


మునగపాకలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల ఖర్చుతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. వేంకటేశ్వర స్వామి విగ్రహంతో పాటు ఇతర విగ్రహాలను తిరుపతి పరిసర ప్రాంతాల్లో తయారుచేయించేందుకు కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి, ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ


గణపర్తి హైస్కూల్‌లో ఫ్యాన్లు అందజేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు.మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని భోజనశాలలో విద్యార్థుల సౌకర్యార్థం బుధవారం ఆమె తన సొంత నిధులతో 8 సీలింగ్ ఫ్యాన్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రమ,పీఎంసీ చైర్మన్ కాండ్రేగుల వెంకటరావు, కాండ్రేగుల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ


వాడ్రాపల్లిలో వరి విత్తనాలు అందజేస్తున్న వీఏఏ తులసి

మునగపాక: రైతులకు రాయితీపై విత్తనాలను అందజేస్తున్నట్టు వాడ్రాపల్లి వీఏఏ తులసి తెలిపారు. మండలంలోని వాడ్రాపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం రబీ సీజన్‌కు సంబంధించిన విత్తనాలను రాయితీపై పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణానికి అనుగుణంగా పంటల సాగు చేపట్టాలన్నారు.

అడుగడుగునా ఛిద్రం.. ప్రయాణం నరకం!



అధ్వానంగా రాంబిల్లి ప్రధాన రహదారి

- ప్రమాదకరంగా గుంతలు
- దుమ్ముకొట్టుకుపోతున్న ఇళ్లు, దుకాణాలు
- వాయుకాలుష్యంతో వ్యాధుల బారిన ప్రజలు


రోడ్డుపై పడిన గోతులు


చెట్లపై ఎగసిపడిన దుమ్ము,ధూళి




రాంబిల్లి వెళ్లే రహదారిలో లారీల వెనుక ఎగసి పడుతున్న ధూళి

రాంబిల్లి(యలమంచిలి): మండల కేంద్రం రాంబిల్లి నుంచి నేవల్ బేస్ ప్రాజెక్టు వరకు 15 కిలో మీటర్లు ఉన్న రహదారి అడుగడుగునా ఛిద్రమైంది. భారీ వాహనాలు అధిక లోడుతో తిరుగుతుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి,నేవల్‌బేస్ ప్రాజెక్ట్ వరకు గల ఈ రోడ్డు రాళ్లు తేలి, పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఒళ్లు హూనమవుతుండడంతో అవస్థలు పడుతున్నారు.

- ఈ రోడ్డుపై రాంబిల్లి నేవల్‌బేస్ ప్రాజెక్ట్ నిర్మాణంలో పనులు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు,కార్మికులు, పలు గ్రామాల ప్రజలు, ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు ఇలా వేలాది మంది ప్రయాణిస్తుంటారు.
- నేవల్ బేస్ ప్రాజెక్ట్ నిర్మాణంలో వినియోగించే పెద్ద పెద్ద బండరాళ్లను తరలించే భారీ వాహనాలు రాత్రీపగలు అనే తేడా లేకుండా నిత్యం రాకపోకలు సాగించడంతో రోడ్డు శిథిలావస్థకు చేరింది.
- ఈ రహదారిపై వాహనాలు ప్రయాణించేటప్పుడు రోడ్డుపై నుంచి దుమ్ము,ధూళి ఎగసిపడి రోడ్డు పక్కన ఉన్న వెంకటాపురం జంక్షన్, ఎస్ఈజెడ్ కాలనీ, జంగాలపాలెం, ఆర్.నర్సాపురం, రాజకోడూరు, కృష్ణం పాలెం, సంతపాలెం, అప్పన్నపాలెం, కొండవారిపాలెం, గోవింద పాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లోని ఇళ్లు,చెట్లపై పడుతుండడంతో దుమ్ముకొట్టుకుపోతున్నాయి.
- రోడ్డు పక్కన గల చిన్నచిన్న హోటళ్లు, తినుబండారాల షాపుల్లో ఆహారపదార్థాలపై దుమ్ముపడడంతో అవి పాడైపోయి వ్యాపారులు నష్టపోతున్నారు.
- దుమ్ముధూళికారణంగా అటుగా ప్రయాణించేవారు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు.
- భారీవాహనాలు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోగా, చాలా మంది ఆస్పత్రులపాలయ్యారు.
- రోడ్డుపై ఉన్న గోతులను ఇటీవల నేవీ, ఆర్‌అండ్‌బీ అధికారులు క్రషర్ బుగ్గతో అక్కడక్కడ పూడ్చారు.పూడ్చిన గోతులపై నుంచి దుమ్ము ధూళి ఎగసిపడకుండా నీటితో తడపాలి. కానీ అలా చేయకపోవడంతో మరింత ప్రమాదకరంగా పరిణమించింది.
- ఆ ధూళి కళ్లలో పడుతుండడం వల్ల వాహనచోదకులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటోందని భయాందోళన చెందుతున్నారు.

విజ్ఞప్తులు, నిరసనలు పట్టని అధికారులు

ఈ రహదారిని బాగుచేయాలని కార్మిక సంఘాల నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా, రహదారిపై బైఠాయించి నిరసనలు తెలిపిన ఆర్‌అండ్‌బీ అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదు. అధికారిక సమావేశాల్లో పదేపదే నిలదీస్తున్నా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశాం, టెండర్లు పిలచామని చెబుతున్నారు తప్ప రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన రహదారి బాగుచేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి



రాంబిల్లి ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అడుగుకో గొయ్యి ఉండడంతో పాటు రాళ్లు తేలడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దుమ్ము,ధూళి ఎగసిపడుతుండడంతో రోడ్డు పక్కన భవనాలు, చెట్లు పాడైపోతున్నాయి. ధూళి కారణంగా గ్రామస్తులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలి.

– జి.దేముడునాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

దుమ్ము కళ్లలో పడుతోంది



మండల కేంద్రం రాంబిల్లిలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఏ చిన్నపనికావాలన్నా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాంబిల్లి వెళ్లాలి. అయితే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆ రోడ్డులో ప్రయాణమంటేనేభయంగా ఉంది.దుమ్మూధూళి కళ్లలో పడుతుండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త రోడ్డు నిర్మించాలి.

– సారిపల్లి పైడిరాజు, వెంకటాపురం

నరకప్రాయంగా ఉంది



రాంబిల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. వాడ నర్సాపురం,కొత్తపట్నం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోయింది. దీంతో గోతుల్లో వాహనాలు పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు బాగుచేసి, ప్రజల కష్టాలు తీర్చాలి.

– కొవిరి రామకృష్ణ, వాడనర్సాపురం

త్వరలో పనులు ప్రారంభిస్తాం

వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్టు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచాం. టెండర్లు ఖరారైతే నిర్మాణపనులు త్వరలో ప్రారంభిస్తాం.

– పి.రాధా కృష్ణ, ఆర్‌అండ్‌బీ డీఈ, యలమంచిలి

మహా ధర్నాను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నాయకులు

అచ్యుతాపురం: సీపీఎస్ రద్దు కోసం ఈనెల 10న విజయవాడలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీసీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథ్ స్వామి కోరారు. ఈ కార్యక్రమంపై ముద్రించిన కరపత్రాలను బుధవారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఆయన కోరారు. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని,పీఆర్‌సీపై ప్రకటన చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు బొత్స వెంకటేశ్వరరావు, పట్నాల నాగేశ్వరరావు, మద్దిల నానాజీ,నక్క అప్పలనాయుడు,కృష్ణ,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి వ్యర్థాలు, మురుగుతో ఇక్కట్లు


కొబ్బరి పీచుపరిశ్రమ నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

ఎస్.రాయవరం: కొబ్బరి పీచు పరిశ్రమల నుంచి వ్యర్థాలను రోడ్డుపైకి వదలడంతో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులకు గురతున్నారు. కొరుప్రోలు, గుర్రాజుపేట, ఆర్‌వీనగర్‌కి మధ్యలో ఉన్న పీచు పరిశ్రమల నుంచి నిత్యం వ్యర్థాలు, ముగురు నీటిని ఆర్‌అండ్‌బీరోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. ముగురు నీరు కారణంగా దుర్గంధం వ్యాపిస్తుండడంతో ముక్కుమూసుకుని ప్రయాణించవలసి వస్తోందని వాహన చోదకులు తెలిపారు. పరిశ్రమల నుంచి ధూళి ఎగిరి కళ్లలో పడుతోందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు.

తపాలా బీమాతో కుటుంబాలకు ధీమా


బీపీఎంలకు పాలసీలగురించి వివరిస్తున్న డీవోపీ పలాస్‌రావు

పాయకరావుపేట: గ్రామీణ తపాలా బీమాతో కుటుంబాలకు ధీమా ఏర్పడుతుందని, అర్హులందరితో తపాలా బీమా చేయించాలని యలమంచిలి డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.కోటేశ్వరరావు తెలిపారు. పాయకరావుపేట సబ్ పోస్టాఫీసులో బ్రాంచి పోస్టుమాస్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ కలిసి పోస్టల్ జీవిత బీమా పాలసీలు నమోదు చేయాలన్నారు. డిసెంబర్ నెలాఖరు నాటికి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి బ్రాంచి పోస్టుమాస్టర్లు వెళ్లి పీఎల్‌ఐ, ఆర్‌పీఎల్‌ఐ పాలసీలు చేయించాలన్నారు. అనకాపల్లి హెడ్ పోస్టాఫీసుకు చెందిన డీవోపీఎల్ వై.బి. పలాస్‌రావు మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పొదుపు ఖాతాలు, జీవిత బీమా పాలసీల గురించి బీపీఎం, ఏబీపీఎంలకు వివరించారు.ఈ సమావేశంలో నూతి శ్రీనివాసరావు, ఎస్.కన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి


డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి

రాంబిల్లి (యలమంచిలి): సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది రాంబిల్లి మండలంలో ఏర్పాటు చేసిన చిన్నతరహా పరిశ్రమల యూనిట్లను ఆమె బుధవారం పరిశీలించి, పలు సూచనలు సలహాలు అందించారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణాలతో స్వయం ఉపాధి పొందుతున్న డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడారు. అనంతరం రాంబిల్లిలో మహిళా సమాఖ్య స్త్రీశక్తి భవనంలో రికార్డులు తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాతో రక్ష


కొరుప్రోలు ఎంఎల్‌హెచ్‌పీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌దేవ్

ఎస్.రాయవరం: చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధిక టీకాలు వేయించాలని, అది రక్షణ కల్పిస్తుందని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్‌దేవ్ అన్నారు.కొరుప్రోలు, పెదగుమ్ములూరు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు టీకాలు వేస్తున్న కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే, బిడ్డ 2.5 కేజీల బరువుతో పుట్టి, సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటాడన్నారు. ప్రతి బిడ్డను సంరక్షించుకోవడానికి పుట్టి నాటి నుంచి 6 నెలల పాటు ముర్రుపాలు పట్టాలని సూచించారు. ముర్రుపాల వల్ల బిడ్డకు వ్యాధినిరోధిక శక్తి పెరిగి,మానసిక, శారీరక ఎదుగుదల బాగా ఉంటాయన్నారు. బిడ్డలకు రాత్రుళ్లు కనీసం నాలుగు సార్లు తల్లిపాలు ఇవ్వడం చాలా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: రానున్న మూడు నాలుగు రోజుల్లో భారీగా వర్షాలు కురిసే సూచన ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.ఆదినారాయణ తెలిపారు.మండలంలోని సత్యవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ కోత కోసిన పంటను త్వరగా కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. రైతులు పంటల దిగుబడి పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాల కోసం రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, వెటర్నరీ డాక్టర్ సాయి శంకర్, గ్రామ ఉద్యానవన సహాయకులు అజయ్, అమృత ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల పాట అజరామరం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి


ఘంటసాలచిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి


పాటల పోటీల్లో మొదటి బహుమతి అందుకుంటున్న హరిణి

యలమంచిలి రూరల్: ఘంటసాల పాట అజరామరమని, తెలుగు నేల ఉన్నంత వరకు ఘంటసాల పాట నిలిచి ఉంటుందని స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి తెలిపారు. స్థానిక ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ భవనంలో ఘంటసాల చిత్రపటానికి ఆమెతో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు,సీనియర్ సిటిజన్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం రమాకుమారి మాట్లాడుతూ ఘంటసాలకు మరణం లేదని ఆయన పాట రూపంలో అందరి హృదయాల్లో జీవించే ఉన్నారన్నారు.

అలరించిన ఘంటసాల పాటలు

ఘంటసాల జయంతి సందర్భంగా బుధవారం రాత్రి పట్టణంలోని శాఖా గ్రంథాలయం పక్కన ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ కార్యాలయం ఆవరణలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు గాయనీ,గాయకులు ఘంటసాల పాటలతో అలరించారు. మొదటి బహుమతి కొక్కిరాపల్లి గురుకులం సంగీతం టీచర్ పి.వి.ఎన్. హరిణి,ద్వితీయ బహుమతి కె.దుర్గాప్రసాద్(రాజమండ్రి), తృతీయ బహుమతి అనకాపల్లికి చెందిన కె.ఎం .నాయుడు పొందారు. సీహెచ్ అప్పారావు,డి. జగదీశ్వరి,ఎస్.నరసింహరావు,బి.వరలక్ష్మిలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జూనియర్ విభాగంలో కొక్కిరాపల్లి గురుకులానికి చెందిన బాలికలు టి.సువర్ణ, ఎస్.హేమ వర్షిణి,ఇ. దుర్గాజ్యోతి మొదటి,ద్వితీయ,తృతీయ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు,మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్,మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి పూరీ జగన్నాథం,సభ్యులు రామారావు,కొండలరావు,సాంబశివరావు, పలువురు ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు కృషి


బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు

నక్కపల్లి: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు అందరూ కృషి చేయాలని ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం నక్కపల్లి భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. చదువుతోపాటు ఆటపాటలు నేర్పేందుకు మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించినట్టు చెప్పారు. భవిత కేంద్రానికి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందన్నారు. ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాణీలలిత, కె.గౌరి, ఐఈఆర్‌పీ సీహెచ్ అనూష తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పరిహారం చెల్లించాలి

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణలో నష్టపోతున్న మునగపాక రెవెన్యూ పరిధిలోని బాధితులకు మెరుగైన పరిహారం అందించాలని పలువురు కోరారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రహదారి విస్తరణ బాధితులు సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. గత ప్రభుత్వ హయాంలో గజానికి రూ.4వేలు ఇస్తామని చెప్పారని, అయితే ఇప్పుడు మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా గజానికి రూ.9వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వం పునరాలోచన చేసి పరిహారాన్ని పెంచేలా చూడాలన్నారు. సమావేశంలో పెంటకోట జగన్నాథరావునాయుడు, బొడ్డేడ సోమసుందర్, పాలమరశెట్టి అప్పలనాయుడు, ఆడారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా తిమ్మరాజుపేట-వాడ్రాపల్లి రోడ్డు


గోతులతో నిండి ఉన్న వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట రోడ్డు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి నుంచి తిమ్మరాజుపేటకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. ఇరు గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించేందుకు గతంలో విశాఖడెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు రైతుల నుంచి భూమి సేకరించి గ్రావెల్ రోడ్డు నిర్మించారు. నాటి నుంచి నేటివరకు ఈ రహదారి పక్కారోడ్డుగా అభివృద్ధి చెందలేదు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. జగనన్న కాలనీకి కూడా ఇదే మార్గం. పాలకులు,అధికారులు స్పందించి రహదారి మెరుగునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మునగపాక: స్థానిక షిరిడీసాయి బాబా ధ్యానమందిరంలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందని ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు.విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారు కోర్టులో

EP 55/2019 - OS 94/2017

Between
మేడిశెట్టి శేషారావు – వాది / DHR
And
శ్రీమంతుల శంకరరావు – ప్రతివాది / JDR 1
శ్రీమంతుల వరహా మంగలక్ష్మి – ప్రతివాది / JDR 2

వేలం ప్రకటన

పై నెంబరు అమలులో JDR లకు చెందినటువంటి ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై నెంబరు డిక్రీ బాకీ వసూలు నిమిత్తం మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారు కోర్టులో వారి ఎదుట తేది. 20/12/2024న ఉదయం 10-30 గం॥ నుండి ఈ కింది షెడ్యూలు ఆస్తిని శ్రీ కోర్టు వారు వేలం షరతులకు మరియు తేది. 17/10/2015 ఫుల్లెర్టన్ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ వారి వద్ద JDR తీసుకున్న తనఖా బాకీకి లోబడి వేలం వేయుదురు. కావున వేలంలో పాల్గొనవచ్చిన వారు తేది. 20/12/2024న శ్రీ కోర్టు వారు ఎదుట హాజరై వేలంలో పాల్గొనవచ్చునని ఇందు మూలంగా ఈ ప్రకటన ద్వారా తెలియపరచడం అయినది.

వేలం షెడ్యూలు వివరాలు

విశాఖపట్నం జిల్లా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా యలమంచిలి సబ్‌రీ, అచ్యుతాపురం మండలం, మరియు అచ్యుతాపురం గ్రామపంచాయితీ గ్రామకంఠంలో గల భూమిలో కొత్తగా కట్టిన స్లాబు ఇల్లుకు గల **హద్దులు : తూర్పు** : పంచాయితీ కాలువ అవల నరమాల సత్తిబాబు ఇల్లు, **దక్షిణం** : నరమాల సత్తిబాబు గారి ఇల్లు, **పడమర** : నంబారి అప్పలనరస గారి ఇల్లు, **ఉత్తరం** : ఇతరుల యొక్క పునాది.
కొలతలు : తూర్పు - పడమరకు – 15 అడుగులు,
ఉత్తరం - దక్షిణంకు – 22 అడుగులు
DHR విలువ – 4,00,000/-
అమీనా విలువ – 8,00,000/-

S.APPALA NAIDU, SRINIVASA PATNAIK
Advocates, Yelamanchili.,
Ph : 9966660694, 8886888925
తేది :02/12/2024
యలమంచిలి